క్లుప్తంగా

ప్రమాద బీమా చెక్కు అందజేత



చెక్కును అందిస్తున్న ప్రజాప్రతినిధులు

వేములవాడఅర్బన్‌: వేములవాడ మున్సిపల్‌ పరిధి నాంపల్లిలోని 5 వార్డులో బీఆర్‌ఎస్‌ కార్యకర్త ఉల్లెందుల ఎల్లయ్య ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందడంతో అయన కుటుంబానికి పార్టీ ప్రమాద బీమా రూ.2 లక్షల చెక్కును మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ రామతీర్థపు మాధవి గురువారం అందజేశారు. అలాగే రెండు సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉందన్నారు. ఆనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి ఆసుపత్రి ఖర్చులకు సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను కూడా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు, కౌన్సిలర్లు జడల లక్ష్మి, నీలం కళ్యాణి, జడల శ్రీనివాస్‌, నీలం శేఖర్‌ పాల్గొన్నారు.

పండుగలకు అప్రమత్తంగా ఉండాలి



వేములవాడ టౌన్‌ సీఐ వెంకటేశ్‌

వేములవాడఅర్బన్‌/వేములవాడరూరల్‌: వేములవాడ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ప్రజలు సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని సీఐ వెంకటేశ్‌, వేములవాడ రూరల్‌ ఎస్‌ఐ నాగరాజు అన్నారు. వేర్వేరుగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పండగకు ఇంటికి వెళ్లే సమయంలో ఇంటికి పెద్ద తాళాలు వేయాలని సూచించారు. అలాగే విలువైన వస్తువులు, బంగారు అభరణాలు లాంటివి వెంట తీసుకెళ్లాలన్నారు. కాలనీల్లో ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే 100 డయల్‌ నెంబర్‌, పట్టణ ఎస్సై 87126 56413, 87126 56414 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. పోలీసులకు సమాచారం అందిస్తే ఆ కాలనీల్లో పెట్రోలింగ్‌ నిర్వహిస్తామన్నారు.

అయ్యప్ప దీక్ష.. ఆరోగ్య రక్ష

- మండల దీక్షతో మెరుగయ్యే ఆరోగ్యం
- నియమనిష్టలతో కూడిన జీవితం
- స్వామి కైంకర్యానికే అంకితమవుతున్న భక్తజనం
- జ్యోతిదర్శనంతో పులకించిపోతున్న భక్తజనం



అందంగా అలంకరించిన మంటపం

సిరిసిల్లకల్చరల్‌: హరిహర పుత్రుడైన అయ్యప్ప స్వామిని కొలిచే భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. నలభై రోజులు (మండల దీక్ష) పాటు నియమనిష్టలతో స్వామిని ఆరాధించే సంస్కృతి కారణంగా ఆధ్యాత్మిక భావనలు విస్తరిస్తున్నాయి. స్వాములందరిలోనూ దైవదర్శనం చేసే సంస్కారంతో భూతదయ, ప్రాణికోటి పట్ల సానుకూల భావనలు పెంపొందుతున్నాయి. వ్యక్తిగత క్రమశిక్షణ, జీవితంపై సానుకూల స్పందన వంటి ఉత్తమ లక్షణాలు అలవడుతున్నాయి. స్వామి దీక్షతో సంస్కారవంతమైన జీవనంతో తమను తాము ఉన్నతీకరించుకుంటున్నారు. సంస్కారం అలవడింది. తిలక ధారణ, పవిత్ర జీవితం గడుపుతున్నారు. కులమతాలకు అతీతమైన మానవీయ భావన అలవడుతోంది. నియమాలు ఆరోగ్య రక్షకు దోహదం చేస్తుంది. శీతల స్నానం, భూతల శయనం, సత్యభాషణం వంటి ఉత్తమ లక్షణాలను కొనసాగిస్తే జీవితాలు పరిణతి చెందుతాయి.

భక్త నిలయం.. హరిహర పుత్ర ఆలయం

జిల్లా కేంద్రంలోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మించి రెండు దశాబ్దాలు కావస్తోంది. గురుస్వామి రాచ విద్యాసాగర్‌ చొరవతో నిర్మాణం పూర్తయి భక్తుల దర్శనాలతో అలరారుతోంది. ప్రతి ఏటా స్వామి ఏదో ఒక ఆభరణాన్ని రూపొందించి అలంకరిస్తున్నారు. 20 ఏళ్లలో సుమారు 600 గ్రాముల బంగారు ఆభరణాలు స్వామి అలంకారానికి పాత్రమవుతున్నాయి. దీక్ష కాలంలో సుమారు 600 మందికి రెండు నెలల పాటు ప్రతీరోజు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. శబరిమలలో మకర జ్యోతి దర్శనం జరిగి జ్యోతి దర్శనాన్ని సైతం ప్రత్యక్ష ప్రసారం చేస్తూ స్థానిక భక్తులకు దర్శన సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. 2015లో లక్ష దీపోత్సవం, 2017లో ఆయత చండీయాగం అద్భుతంగా నిర్వహించారు. భక్తులు అందించిన విరాళాలతో ఈ ఏడాది రూ.కోటి వ్యయంతో కొత్తగా అష్టలక్ష్మీ ఆలయాన్ని కూడా నిర్మించారు.

ఉత్తమ సంస్కారంతో కూడిన జీవితం



ఇప్పటికి 26 ఏళ్లుగా క్రమం తప్పకుండా అయ్యప్ప స్వామి దీక్షను ఆచరిస్తున్నా. మండల దీక్ష కాలంలో అలవడే ఉత్తమ సంస్కారాలన్నీ నిత్య జీవితంలో పరిపక్వత సాధించేందుకు దోహదపడుతోంది. క్రమశిక్షణ, దాతృత్వ లక్షణాలు పెరిగాయి. మానసిక ప్రశాంతత చేకూరుతోంది. వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ సభ్యుల సంక్షేమం అన్నీ అయ్యప్ప కరుణతోనే పెరుగుతున్నాయి. అందుకే స్వామి ఆలయ అభివృద్ధికి నావంతుగా కృషి చేస్తున్నా.

– బీవీఆర్‌ ప్రకాశ్‌, గురుస్వామి

స్వామి అనుగ్రహమే నా జీవితం



దీక్షకు ముందు వ్యక్తిగత జీవితం పూర్తిగా క్రమశిక్షణ లేకుండా సాగేది. ఏదో పుణ్య సమయంలో స్వామి దీక్ష తీసుకున్నాను. 17 ఏళ్లుగా కొనసాగుతున్నా. లైఫ్‌లో ఏర్పడిన డిసిప్లిన్‌తో ఆర్థికంగా, సామాజికంగా మంచి స్థితిలో ఉన్నాను. దీక్షలో పాటించే నియమాలు ఆ తరువాత కూడా కొనసాగించడంతో కుటుంబం కూడా గాడిన పడింది. ప్రస్తుతం సమాజంలో ఈ స్థాయి గుర్తింపు తెచ్చుకోవడం కూడా స్వామి అనుగ్రహంగానే భావిస్తున్నా.

– అన్నల్‌దాస్‌ అనిల్‌, దీక్షాపరుడు

మెరుగైన మానవ సంబంధాలు



సుమారు 14 ఏళ్లుగా స్వామి సేవలో తరిస్తున్నాను. మనిషి జీవితానికి తప్పనిసరిగా అవసరమైన అన్ని మార్గదర్శకాలు దీక్షలో ఇమిడి ఉన్నాయి. కాబట్టి స్వీయ సంస్కారం, మంచి మానవ సంబంధాలు మెరుగుపడ్డాయి. తద్వారా వృత్తి, వ్యాపార రంగంలో పురోగతి కనిపిస్తోంది. వ్యక్తిగత సమస్యల కారణంగా మధ్యలో కొన్నేళ్లు దీక్ష తీసుకోలేక పోయాను. అయినా స్వామి కటాక్షం కనిపిస్తూనే ఉంది.

– చిదుర నాగ శంకర్‌,



మహా పాదయాత్రతో స్వామిని దర్శించుకున్న భక్త బృందం

వేలాది జీవితాల్లో వెలుగులు



37 సంవత్సరాలు, ఆరోగ్య శాఖలో ఉద్యోగి అద్భుతమైన పరిణామాలు చోటు చేసుకుంటాయి. వ్యక్తిగా చెడు అలవాట్లు నుంచి దూరమై మనిషిగా మారాను. కుటుంబ అభివృద్ధి, సంతృప్తికరమైన జీవితం సాధ్యమైంది. లక్ష దీపోత్సవం, ఆయత చండీయాగం, అష్టలక్ష్మీ ఆలయ నిర్మాణం అంతా స్వామి అనుగ్రహంతోనే జరిగింది. అందరినీ అనుగ్రహించే తత్వం ఆయనది.స్వామి కటాక్షంతో ఇటీవల 12 మందితో మహాపాదయాత్ర కూడా పూర్తి చేశాను. ఇప్పటి వరకు సుమారు 8 వేల మందికి మాలధారణ చేశాను. వారి కుటుంబాల్లో కొత్త వెలుగు ప్రసరించింది.

– రాచ విద్యాసాగర్‌, గురుస్వామి

క్రీడా వార్తలు

జిల్లా స్థాయి క్రికెట్‌ టోర్నమెంట్‌ ప్రారంభం



క్రికెట్‌ పోటీలు ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌

ముస్తాబాద్‌: మండలంలోని పోతుగల్‌లో పానుగంటి సందీప్‌చారి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్‌ టోర్నీని రజక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్‌ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు, సర్పంచ్‌ గౌతంరావు, ఉపసర్పంచ్‌ మంజుల, ఎంపీటీసీ బాలకిషన్‌ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు..

ఇల్లంతకుంట: మండంలోని పెద్దలింగాపూర్‌లో ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను సర్పంచ్‌ గొడిసె జితేందర్‌గౌడ్‌ గురువారం ప్రారంభించారు. ఎంపీటీసీ కరివేద స్వప్న, ఉపసర్పంచ్‌ కుమార్‌, అనీల్‌ కుమార్‌, ముస్తాఫా, ప్రభాకర్‌, మల్లేశ్‌గౌడ్‌ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులతో డీఎస్పీ నాగేంద్రచారి

కోనరావుపేట: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని డీఎస్పీ నాగేంద్రచారి పేర్కొన్నారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా గురువారం పోలీసుల ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్‌ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 14 టీమ్‌లు పాల్గొన్నాయి. మామిడిపల్లి (ప్రథమ), వట్టిమల్ల(ద్వితీయ) స్థానాలలో నిలిచాయి. విజేత జట్లకు డీఎస్పీ నాగేంద్రచారి బహుమతులు అందజేశారు. ఎస్సై రమాకాంత్‌, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్‌ నరేందర్‌, ఎంపీడీవో రామకృ, సర్పంచ్‌ వంశీకృష్ణరావు, బీఆర్‌ఎస్‌ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య తిరుపతి పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



ఇల్లంతకుంట: పూలమాల వేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్‌



గంభీరావుపేట: వేడుకల్లో పాల్గొన్న నాయకులు

సిరిసిల్లటౌన్‌: స్వామి వివేకానంద 160వ జయంతి వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో ఏబీవీపీ జిల్లా కో–కన్వీనర్‌ మారవేని రంజిత్‌, ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ మురళీధర్‌రావు, కౌన్సిలర్‌ గూడూరి భాస్కర్‌ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

గంభీరావుపేట: వివేకానందుని విగ్రహానికి టెస్కాబ్‌ చైర్మన్‌ కొండూరు రవీందర్‌రావు, టీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్యతో పాటు నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ముస్తాబాద్‌: ముస్తాబాద్‌, తెర్లుమద్ది, పోతుగల్‌ గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో ఎస్సై వెంకటేశ్వర్లు, బీజేపీ మండల అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్‌ ప్రచారక్‌ భానుచందర్‌ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలో జరిగిన వేడుకల్లో జెడ్పీ వైస్‌చైర్మన్‌ సిద్దం వేణు, బీజేపీ మండల అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

చందుర్తి: మండలంలోని మల్యాలలో చిన్నారుల నృత్యాలు అలరించాయి. తహసీల్దార్‌ మజీద్‌, వైస్‌ఎంపీపీ మందాల అబ్రహాం, సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్‌: వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ప్రిన్సిపాల్‌ ప్రమోద్‌ కుమార్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ కో ఆర్డినేటర్‌ అంజయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంపీపీ పడిగెల మానస, ఉప సర్పంచ్‌ పెద్దూరి తిరుపతి, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలో నిర్వహించిన వేడుకల్లో సర్పంచులు కెంద గంగాధర్‌, అరుణ, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పట్టణంగా సిరిసిల్ల

- మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ జిందం కళ
- బ్రాండ్‌ అంబాసిడర్లుగా రవి, స్వరూప



స్వరూపను సన్మానిస్తున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌

సిరిసిల్లటౌన్‌: బాపూజీ ఆశించినట్లుగా స్వచ్ఛ సిరిసిల్ల సాధనకు పౌరులు కృషిచేయాలని సిరిసిల్ల మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ జిందం కళ కోరారు. స్వచ్ఛ సర్వేక్షన్‌–2023లో భాగంగా గురువారం 17వ వార్డులో చేపట్టిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మున్సిపల్‌ పారిశుధ్య కార్మికుల ద్వారా ప్రతి రోజూ చేపడుతున్న శుభ్రత కార్యక్రమాలను వివరించారు. అనంతరం మున్సిపల్‌ ఆఫీసులో నిర్వహించిన కార్యక్రమంలో బ్రాండ్‌ అంబాసిడర్లుగా సిరిసిల్ల రెడ్‌క్రాస్‌ చైర్మన్‌ గుడ్ల రవి, పర్యావరణ ప్రేమికురాలు గజవాడ స్వరూపను ప్రకటించి, సన్మానించారు. మున్సిపల్‌ కమిషనర్‌ వెల్దండి సమ్మయ్య పాల్గొన్నారు.

కంటివెలుగు ఏర్పాట్లపై సమీక్ష



వేములవాడరూరల్‌: మాట్లాడుతున్న ఎంపీపీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లపై ఆయా మండలాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు గురువారం సమీక్షించుకున్నారు. ఈనెల 18 నుంచి ప్రారంభం కాబోయే ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.

ఇల్లంతకుంట: స్థానిక రైతువేదికలో జెడ్పీ వైస్‌చైర్మన్‌ సిద్దం వేణు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ భాగ్యలక్ష్మి, కంటి వెలుగు మండల ఇన్‌చార్జి ఉమాదేవి, వైద్యాధికారిణి శరణ్య పాల్గొన్నారు.

వేములవాడరూరల్‌: మండల పరిషత్‌ కార్యాలయంలో నిర్వహించన ప్రత్యేక సమావేశంలో వేములవాడ రూరల్‌ ఎంపీపీ బండ మల్లేశం, ఎంపీడీవో రాంరెడ్డి పాల్గొన్నారు.

బోయినపల్లి: ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్‌, జెడ్పీటీసీ ఉమ, సెస్‌ డైరెక్టర్‌ కొట్టిపెల్లి సుధాకర్‌, వైస్‌ఎంపీపీ కొనుకటి నాగయ్య, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, ఎంపీడీవో నల్లా రాజేందర్‌రెడ్డి, వైద్యాధికారులు రేణుక, రేణుశ్రీ, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, సెస్‌ డైరెక్టర్‌ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్‌ కృష్ణారెడ్డి, ఎంపీడీవో చిరంజీవి, డాక్టర్లు స్రవంతి పాల్గొన్నారు.

ముస్తాబాద్‌: ముస్తాబాద్‌, గూడెం ఆరోగ్య ఉపకేంద్రాలలో కంటి వెలుగుకు సంబంధించిన ఏర్పాట్లను ఎంపీడీవో రమాదేవి పరిశీలించారు.

వీర్నపల్లి: మండల పరిషత్‌ కార్యలయంలో ఎంపీపీ మలోతు భూల, ఎంపీడీవో నరేష్‌ కుమార్‌, మెడికల్‌ ఆఫిసర్‌ చిరంజీవి,సెస్‌ డైరెక్టర్‌ మాడుగుల మల్లేశం, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు ఎడ్ల సాగర్‌ ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండల ప్రజాపరిషత్‌ కార్యలయంలో నిర్వహించిన సదస్సులో ఎంపీపీ పడిగెల మానస, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వల్లకొండ వేణుగోపాల్‌రావు, ఎంపీడీవో పి.లచ్చాలు, మెడికల్‌ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే నవసమాజ నిర్మాతలు



సన్మానం పొందిన మహిళా లెక్చరర్లు

వేములవాడఅర్బన్‌: ఉపాధ్యాయులే నవసమాజ నిర్మాతలని గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థుల పీపీఎల్‌ జిల్లా కమిటీ అధ్యక్షుడు మూలే కిశోర్‌ అన్నారు. వేములవాడ పట్టణంలోని గురుకుల సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం సావిత్రిబాయి పూలే 191వ జయంతి వేడుకల్లో భాగంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం మహిళా అధ్యాపకులను సన్మానించారు. దేశంలోనే మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా మహిళల అభ్యున్నతికి పాటుపడిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అన్నారు. ఆ రోజుల్లోనే బాలికా విద్య, మహిళా హక్కులపై పోరాడారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పీపీఎల్‌ రాష్ట్ర అధ్యక్షుడు నర్సయ్య, లలిత కుమారి, వెంకటేశ్‌, దార మధు, లక్ష్మణ్‌, మారుపాక రాజు, కిశోర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ జేఏసీ చైర్మన్‌గా గొడిసెల రమేశ్‌

సిరిసిల్ల: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ ఉద్యోగుల జేఏసీ నూతన అధ్యక్షుడిగా గొడిసెల రమేశ్‌(ముస్తాబాద్‌) గురువారం ఎన్నికయ్యారు. జేఏసీ గౌరవ అధ్యక్షులుగా బింగి చిరంజీవి(ఎల్లారెడ్డిపేట ఎంపీడీవో), కో చైర్మన్లుగా తంగళ్లపల్లి మల్లయ్య (ఏపీవో వేములవాడ), హర్షద్‌ పాషా(ఇల్లంతకుంట), మంచికట్ల శ్రీనివాస్‌(చందుర్తి), ఎస్‌.కె.అహ్మద్‌(కోనరావుపేట), వంతడ్పుల కరుణాకర్‌(వేములవాడ), ప్రధాన కార్యదర్శిగా ఎండీ జమీల్‌(డీఆర్‌డీఏ ఆఫీస్‌), కోశాధికారిగా కె.శేఖర్‌(వేములవాడ) ఎన్నికయ్యారు. జేఏసీ గౌరవ సలహాదారులుగా కూర నర్సింలు(ఏపీడీ సిరిసిల్ల), ఇప్ప ధనుంజయ్‌(రుద్రంగి), మంచికట్ల శ్రీనివాస్‌(ఏపీవో, కోనరావుపేట)లను ఎన్నుకున్నారు.

పంచాయతీల కంట్లో నలుసు



మూడపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం

- సర్పంచుల నెత్తిన కంటి వెలుగు బాధ్యతలు
- అదనపు భారంగా మారుతుందని సర్పంచుల ఆవేదన
- ఉత్తర్వులు జారీ చేసిన డీపీవో
- చేసిన పనులకు బిల్లులు రాలేదని సర్పంచుల ఆవేదన
- ప్రత్యేక నిధులు ఇవ్వాలని డిమాండ్‌

చందుర్తి: రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగుకు సర్పంచులను బాధ్యులుగా చేయడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 18 నుంచి రెండో విడత ప్రారంభించనున్న నేపథ్యంలో గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నారు. అందుకు ఆవసరమైన మౌలిక వసతులను కల్పించాల్సిందిగా జిల్లా పంచాయతీ అధికారి పంచాయతీలకు ఉత్తర్వులు జారీ చేశారు. టెంట్లు, బల్లలు, కుర్చీలు, మంచినీటి వసతి ఖర్చులు పంచాయతీలు భరించాలని పేర్కొన్నారు. కాగా ఇప్పటికే పలు అభివృద్ధి పనులకు లక్షల్లో ఖర్చులు పెట్టుకుని బిల్లులు రాక పీకలోతు అప్పులతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని, మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు కంటి వెలుగు ఖర్చులు కూడా తమ నెత్తిన వేయడంపై సర్పంచులు మండల అధికారులతో మొరపెట్టుకుంటున్నారు. ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదని అంటున్నారు.

అభివృద్ధి కోసం అప్పులు చేసి..

ప్రభుత్వం ఆదేశాల ప్రకారం చాలామంది సర్పంచులు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు అప్పు తెచ్చి పనులు చేశారు. తీరా పనులు పూర్తి చేశాక ఖజానాలో డబ్బులు లేక, బిల్లులు రాక, తెచ్చిన అప్పుకు వడ్డీ కూడా కట్టలేక ఇబ్బంది పడుతున్నామని అధికార పార్టీ సర్పంచులు ఇటీవల స్థానిక ఎమ్మెల్యేకు మొర పెట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టరు నెలసరి వాయిదాలు, డీజిల్‌ ఖర్చు, పంచాయతీ కార్మికులు వేతనాలు, విద్యుత్‌ బిల్లులు వీటన్నింటి ఖర్చులు భరించలేక సతమతమవుతున్న తమకు కంటి వెలుగు ఏర్పాటు బాధ్యతలు అప్పగించడం భావ్యం కాదంటున్నారు. కంటి వెలుగు కార్యక్రమానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు ఇవ్వాలని వారు డిమాండ్‌ చేస్తున్నారు.


మా నెత్తిన మరో భారం



పారిశుధ్య పనులు, ట్రాక్టర్‌ ఖర్చులే నెలకు తడిసి మోపెడవుతున్నాయి. ఇప్పటికే ఖర్చులు పెట్టి అప్పుల్లో మాకు ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం మరో భారం నెత్తిన పెట్టుతుంది. సర్పంచ్‌గా గెలిచిన లేని అప్పులు చేసుకున్నాం. ప్రభుత్వం మాత్రం చేసిన పనులకు బిల్లులు చెల్లించేందుకు జాప్యం చేస్తోంది.

– నేతికుంట జలపతి, సర్పంచ్‌ , మర్రిగడ్డ

పంచాయతీ నిధుల నుంచి తీసుకునేందుకు అనుమతి



కంటి వెలుగు కార్యక్రమానికి ప్రభుత్వం గ్రామపంచాయతీ నిధుల నుంచి తీసుకునే ఆవకాశాన్ని కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సర్పంచులు భారంగా భావించకుండా ఏర్పాట్లు చూడాలి. పెండింగ్‌ బిల్లుల నివేదిక జిల్లా అధికారులు పంపించాం. త్వరలోనే బిల్లులు అందజేస్తాం.

– పత్తి రవీందర్‌, ఎంపీడీవో, చందుర్తి

ఆస్ట్రానమీ సెమినార్‌కు టీచర్ల ఎంపిక



నిట్‌లో సెమినార్‌కు హాజరైన టీచర్లు

సిరిసిల్ల ఎడ్యుకేషన్‌: ఆస్ట్రానమీ సెమినార్‌కు జిల్లా నుంచి ఇద్దరు టీచర్లు ఎంపికైనట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గుర్రం ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. వీర్నపల్లి మోడల్‌ స్కూల్‌లో పని చేసే ఉల్లోజు శ్రీరాములు, కస్తూ్మ ప్రేమ్‌ రాష్ట్రస్థాయిలో స్కోప్‌ ప్రాజెక్టుకు ఎంపికైన వీరు రెండు రోజులుగా వరంగల్‌లో నిర్వహించిన సెమినార్‌లో పాల్గొన్నట్లు తెలిపారు. ఆయనతోపాటు జేవీవీ ప్రధాన కార్యదర్శి సంపతి రమేశ్‌ టీచర్లను అభినందించారు.

21న పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సిరిసిల్ల: ప్రగతిశీల విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) పూర్వ విద్యార్థుల సమ్మేళనం జనవరి 21న హైదరాబాద్‌ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ కన్వీనర్‌ ఆర్‌.గురువారెడ్డి, కో కన్వీనర్‌ డాక్టర్‌ కొండా నాగేశ్వర్‌ గురువారం తెలిపారు. నేటి సమకాలిన రాజకీయాలపై తక్షణం స్పందించాల్సిన అవశ్యకతను గుర్తించి ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఏర్పాటు చేసినట్లు వారు వెల్లడించారు.